
వేలో పెట్టి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటావా" అనేవాడు సీరియస్‌గా. ఏ రెండు మూడువేలో అనే మాటను అతి తేలిగ్గా ఉచ్చరిస్తూ. "వీళ్ళనే మాటల్ని విట్టీగా తీసుకుంటే నీకే బాధావుండదుకదా!" అనేవాడు. తమ్ముడయితే మరీను, "భానుమతి కథలో చెప్పినట్లు (ఆకథ నే చదవలేదులెండి) ఏరోడ్డు రోలరో రాత్రి పూట లాగుతూ వుండు. నీ వెనకే నేను ఫ్లాస్కు నిండా ఓవల్‌టీన్, ప్లాస్టిక్ బుట్టనిండా పళ్ళూ పెట్టుకుని నిలబడతా. కొంచెంసేపు లాగటం, కొంచెం ఓవల్‌టీన్ త్రాగటం, ఒకపండు తినటం. ఏం అలా చేద్దామా" అనేవాడు. దాంతో నాకూ నవ్వొచ్చేది.

ఎప్పుడన్నా అరుదుగా కనిపించేవారు "సన్నబడ్డట్టున్నావే" అనే వారనుకోండి. మొహం చిట్లించి చెవులురెండూ మూసుకుని "రామ, రామ, అలాటి మాటలు నా దగ్గిరెత్తకండి. నా డిక్షనరీలో అలాటి మాటకు అర్థంలేదు" అనేదాన్ని. దీంతో ఎదటివాళ్ళూ నవ్వేసేవాళ్ళు. "గుంజీలు, బస్కీలు తియ్యి. సన్నబడిపోవచ్చు" అన్నది నా ఫ్రెండ్ ఒకామె. భేష్. బాగుందని గుంజీలు తియ్యటం మొదలెట్టాను. అబ్బ! కాళ్ళల్లో ఇంత లావు బిళ్లలుకట్టి నడవలేనంత బాధ. ఈపద్ధతి లాభంలేదని వదిలేశాను. నిమ్మరసం ప్రొద్దుటే నీళ్ళల్లో పిండుకు త్రాగితే సన్నబడవచ్చన్నారు. ఇది శ్రమలేని పద్ధతి. ఏం లాభం. నాకు పనిచెయ్యలేదు. వరసగా పదిరోజులు త్రాగితే, పదకొండోనాడు, విపరీతమైన దగ్గూ, రొంప, పడిశం సినిమాలో ఎడ్వర్‌టైజ్‌మెంటులాగా. ఇహ అక్కణ్ణుంచీ బ్లడ్ టెస్టులూ డాక్టరు మందులూ పెద్దవాళ్ళ కేకలూ, వగైరా, వగైరా. ఏది ఏమైనా నా యీ లావుపాటి శరీరం వయసుకి మించిన అనుభవాల్ని ప్రసాదించింది.

అసలు, యింతకూ చెప్పొచ్చే దేమిటంటే, "మీరు మరీ లావుగా వున్నారా?" అన్న శీర్షికలో చెప్పినట్లు. అందమైన నాజూకు బొమ్మల్ని చూసి సంతోషించటం. యిది మొదటి చిట్కా. కత్తిరించి పెట్టుకున్న "బాపూ" బొమ్మలపూజ రోజూ ఒక గంట తీరిగ్గా చేస్తూనేవుంటా. నాజూకు నారీమణుల వర్ణనలు సాధ్యమైనంత వరకూ బట్టీ పడుతూనేఉంటా. తీపిజోలికి మాత్రం పోకండి అన్నది రెండవచిట్కా. కాఫీలో పంచదార వేస్తారని, కాఫీకూడా మానేశా. రెండుపూటలా భోజనం, టిఫిన్లూ తగ్గించేశా. అందంగా భోజనాలు అమర్చడంలో నిమగ్నమయిపోవటం మూడవ చిట్కా— కాబోలు. అదీ తు.చ. తప్పకుండా ఆచరిస్తాను. రచయిత్రిగారు చెప్పినట్లు, కాలమే తేవచ్చు నేననుకున్న మార్పు. నా అనుభవాల నిలా రాసుకుంటూ పోతే ఇంతలావు గ్రంథమయ్యే అవకాశం వుంది. అందుకే నాకు భయం. ఇహ వుంటా. ఏది ఏమైనా లావుగా వున్నంతబాధ మరొకటి లేదనుకోండి.

□□□










# నిత్యానందంగారి సాంసారిక విజయాలు



"పొద్దెక్కినా తలుపు తీసి వూడిపడరేం? అమ్మాయ్ సుబ్బమ్మా, వాడికి లేకపోతే మానె, నీకైనా బుద్ధిలేదే? ఎంతసేపు గడియ బిడాయించుకు పడుకుంటారు" అని అమ్మ సాధింపు ప్రారంభించింది.

అమ్మకి నాలుగున్నరనించీ నిద్దరపట్టదు. నాయనమ్మలాగ గజేంద్ర మోక్షంలో పద్యాలూ భజగోవింద శ్లోకాలూ చదువుకుంటూ మంచంమీదే పడుంవాల్సి వుండిపోదు. లేచి యిల్లంతా సవరిస్తుంది. ఒంట్లో బాగాలేకపోయినా, చచ్చేదాకా వెట్టిచాకిరీ తప్పదని గొణుక్కుంటుంది. విసుక్కుంటుంది.

"లేవరా నిత్యానందం, యెండెక్కిపోయిందిరా"

కళ్లు నులుముకుంటూ లేవబోయాను.

'ఇంకా బద్ధకం తీరలేదు. పడుకోండి' అంది మా ఆవిడ.

"యెండెక్కిపోయిందట" అన్నాను.

"మరేం పరవాలేదు. ఇంకా ఆరున్నర కాలేదు. ఈ వెధవ్వూళ్లో తెల్లారకుండానే యెండొస్తుంది. మీనాన్న ఆఫీసుకి టైముపట్టి వెళతారా, యెండనిబట్టా! పడుకోండి, పడుకోండి"

"నే లేస్తాను. నువ్వు పడుకో"

"మీరుమాత్రం లేచి వెలగబెట్టే రాచ కార్యాలేమున్నాయి. మొగుడు లేచినా యింకా పడుకుందని నన్ను ఆడిపోసుకో డానికా. మీరూ పడుకోండి" అని దబా యించేసింది.

"లేవరా"

"పడుకోండి"

"నిన్నేరా"

"మిమ్మల్నేనండీ"

"లెమ్మంటే"

"పడుకోమంటే"

అవతల తల్లి. గదిలో భార్య. ఎవరు గెలిచారా ? ఏమిట్రా. చొప్పదంటుప్రశ్న ? ఇలాటి విషయాల్లో ఎవరు గెలుస్తార్రా ?

"వారేయ్. ఎంతసేపురా మొద్దునిద్దర లే" అని మానాన్న అందుకున్నాడు. ఉలిక్కిపడి లేచి కూచున్నాను. నాన్న అందుకుంటే రంధోలువాయించినట్టే. ఇహ లాభంలేదు. లేచి బయటికి పోతేనేమంచిది.

"అనవసరమయిన విషయాల్లో జోక్యం కలగజేసుకుంటున్నారు మీ నాన్న" అంది మా ఆవిడ. తనేదో మహాసత్యం మొట్ట మొదటి మాటుగా కనిపెట్టినట్టు. నాకెప్పుడో తెలుసునయ్యో ఆ సంగతి. లేకపోతే ఈపెళ్ళి మాత్రం జరిగుండేదీ ! మొదట ఇష్టంలేదన్నానే. ఆ అమ్మాయే. ఇప్పుడిష్టమే. ఎలా మారిపోయానా ? ఒరే. పిచ్చిప్రశ్న వెయ్యకు. పెళ్ళామంటే అందరికీ ఎలా ప్రేమపుట్టుకొస్తుందో, నా కూ అలానే. వారేయ్ కాస్సేపు నీ కుళ్ళుంకలు కట్టేసి, విను. ఏం చెబుతున్నానూ. మా నాన్న అనవసర విషయాల్లో జోక్యం చేసుకుంటున్నాడని మా ఆవిడ అందికాదూ.

"అవును. ఆ సంగతి నాకెప్పుడో తెలుసు" అన్నాను.

"అనవసర జోక్యం కలగజేసుకోవద్దని చెప్పండి" అంది.

"నేనే ? మానాన్నతోనే ? కరుస్తాడు."

"కరవడానికి కుక్కా యేమిటండీ. మనిషేగా ?"

"నీకేం నువ్వేమైనా చెబుతావు. ఎదట పడేది నువ్వా నేనా ?"

"ఏమిట్రాగదిలో గుసగుసలు. లేచి రమ్మంటేను" గుండెలుఅదిరిపోయేలాగ నాన్న కేక. ఎదిగి, పెళ్లాంతో కాపురంచేస్తున్న కొడుకుతో అనవలసిన మాటే ? 'నాన్నగారూ, ఇలా నాతో మాట్లాడ్డానికి వీల్లేదు. మా ఆవిడ వింటూంటే నామీద అధారిటీ చెలాయించడానికి వీల్లేదు' అని లేచి చెప్పేద్దామనుకున్నాను. కాని నేను వూరికే లేచిపోతున్నాననుకుంది కాబోలు మా ఆవిడ. నే లేవకుండా అదిమిపెట్టి "ఆయనకి తలనెప్పిగా వుందండీ. లేవలేకుండా వున్నారు" అని జవాబు చెప్పింది.

"అజీర్తి తిళ్ళు తింటే తలనొప్పి రాకేం చేస్తుంది !"

"నిన్నరాత్రి తిన్నగా భోంచెయ్యనే లేదు."


"సాయంకాలం టిఫిను మస్తుగా తింటే రాత్రి భోజనమెందుకు !"

"ఏతలనొప్పయినా. లేచి వొళ్ళువొంచి పనిచేస్తే అదే పోతుంది"

"అడిపోతేగాని లేవడానికి ఓపికరాదు. లేస్తే తల తిరుగుతుంది."

మానాన్న వెనక్కి తగ్గాడు.





"తలతిరుగుతోందీ? జ్వరమొచ్చిందేమో చూడనీ" అని మా అమ్మ కేకెట్టింది.

"జ్వరం లేదులెండి"

"అన్నీ తెలిసినట్టు మాట్లాడతావేమిటి ? వొళ్ళు చూడనీ"

"నే చూసే చెబుతున్నాను. చల్లగానే వుంది".

"మా అబ్బాయి సంగతి నీకు తెలీదు. పైకి చల్లగా వున్నా ఒక్కొక్కప్పుడు ఉష్ణం వుంటుంది."

"దానికి ముసుగెట్టుకు పడుకోడమే మందు."

"శొంతికొమ్ము అరగదీసిపెడితే రెండు నిమిషాల్లో తలనొప్పి పోతుంది".

"ఆనాటు వైద్యపు రోజులు పోయాయి. ఇప్పుడు అంజనాలకి, ఆస్పిరిన్‌లకి గాని లొంగడంలేదు ఈ తలనొప్పులు."

మాటకిమాట జవాబు చెబుతూ పావుగంట దాకా మా ఆవిడ తను కదల్లేదు. నన్ను కదలనివ్వలేదు. కొంత అయిన తరవాత "బద్ధకం బలిస్తే, తలనొప్పేగాదు, ఒళ్లంతా నెప్పులు పుట్టుకొస్తాయి. లేచి మందన్నా మింగమను" అని నసుక్కుంటూ నాన్న జారుకున్నాడు.

"అన్నిటికీ అదే జవాబు చెబుతుంది కాని వీడినోరు పెగలదేం ?" అని గొణుక్కుంటూ చివరికి అమ్మ జారుకుంది. మరో పావుగంట విశ్రాంతి తీసుకునిగాని మేం బయటపడలేదు. తరవాత ఒకటి రెండు మాట్లు మళ్ళీ మమ్మల్ని పెందరాళే లేపడానికి ప్రయత్నంచేశారు కాని, మనం కొరకబడలేదు. ఏమిటనుకున్నావురా. నిత్యానందమంటే? మనకి కొంత మాట సాయం. వెనకదమ్ము వుండాలిగాని. నే లేస్తేమనిషిని గాను. మా నాయనమ్మ బతికివున్నరోజుల్లో. నీకు జ్ఞాపకం లేమా. అప్పడాలపిండి మాస్టారుక్కూడా నేనంటే హడలుపుట్టింది. అప్పడాలపిండి మాస్టార్నెరగవురా. గవర్రాజుగారిబడిలో రెండో మాస్టారు. చిన్నప్పు

డెప్పుడో వాళ్ళమ్మ అప్పడాలపిండి కలిపి పెట్టుకుంటే దబ్బకాయంత ముద్ద ఎవరూ చూడకుండా యెత్తుకుపోయి. స్వయంగా అంతా భక్షించేశాడుట. దాంతో నాలుగు రోజులు వి రో చ నా లు పట్టుకున్నాయట. కలరా వొచ్చిందేమోనని రెండు రోజులు మందు లిప్పించిం తరవాత యీ సంగతి బయటపెట్టాడుట: అంచేత వాళ్ళింట్లోవాళ్ళే అప్పడాలపిండి అని ముద్దుపేరెట్టుకున్నారుట. వాళ్ళ వాళ్ల పెట్టుగున్న పేరేగదా. సంతోషంతో స్వీకరించగూడదూ। అమాట ఏ రూపంలో వినిపించినావుడుక్కునేవాడు. తిట్టేవాడు. కొట్టేవాడు. పేబెత్తంతోకాదురా. రూళ్ళకర్రతో కొట్టేవాడు. ఎక్కాలువల్లించమనడం తప్ప క్లాసులో చెప్పేపాఠం లేదు.. దానికి తోడు వా డి కి న త్తికూడాను. బకాసురుడు అదేదో వూరిమీదపడి అందర్నీ పీడించుకు తిన్నట్టుస్కూల్లో పిల్లల్నందర్నీ పీడించుకుతినేవాడు. కాని బకాసురుడు ప్రాణానికి భీముడు తటస్థపడ్డాడు. అప్పడాల పిండి మా స్టా రు కి ఏకు మేకై గుచ్చుకున్నాడు నిత్యానందం. ఎలా గంటావా? ఓనాడు మా నాయనమ్మంది "వొరే నిత్యానందం. అప్పడాలు యెండబెట్టాను. కాకులు రాకుండా కాయరా" అంది.

"కాకుల్నయితేకాస్తానుగాని. పిచ్చికల్ని పిలుస్తాను నాయనమ్మా" అన్నాను.

"వీపుచిట్లగొడితే దావురుమని యేడుస్తావు కూడాను" అన్నాడు మానాన్న. మా నాన్నకి 'జోకులు' తెలిసేవిగావు. మా నాయనమ్మ మాత్రం నత్తిగాడికి కవిత్వం చెప్పడ మొస్తుంది.' అని సంతోషించింది. ఉష్ ఉష్ అని కాకుల్ని కాని అలిసిపోయి. అలిశ్యంగా స్కూలుకెళితే మాస్టారు పట్టుకున్నాడు.

"ఏ ఎందుకింత ఆలశ్యమయింది"

"మాస్టారండీ మరేమోనండీ...."

"ని ని నీళ్ళ నననమలకు"

"మా నాయనమ్మంది అప్పడాలు ఎండబెట్టి కాకుల్ని కాయమందండి. అంచేత ఆలశ్యమయి పోయిందండి".

"భ భ భడవా బె బ్బెంచెక్కు"

"నేనేం చెయ్యలేదండి మాస్టారూ. మా నాయనమ్మే అప్పడాలు ఎండబెట్టి కావలా వుండమందండి. మాయింట్లో కాకులు చాలా యెక్కువ. కాపలాకాయకపోతే అప్పడాలు బతకనివ్వవు."

"పు పుండాకోర్ గొగ్గోడ కుర్చీవెయ్యి."

"తప్పంతా కాకుల్దండి. నాది కాదండి."

"వీపు చిచీరేస్తాను వావాళ్లవుతికేస్తాను" మాట వినిపించుకోడు. ఒకటే ధుమధుమ. "చెచెయ్యిపట్టు" అరిచెయ్యి వెనక్కి తిప్పి రూళ్ళకర్రతో ముడికలమీద వాయించాడు. "మా నాయనమ్మతో చెబుతానుండండి" అని ఏడుచుకుంటూనే స్కూ ల్లోం చి పారిపోయాను. నాయనమ్మ రెట్టింపు పటికబెల్లం పెడితేనేగాని. ఏడుపు మానలేక పోయాను.

"నే నింక అ స్కూల్లో చదువుకోను నాయనమ్మా. మరోస్కూల్లోచేర్పెయ్యి।"

"వెర్రినాన్నా. అర్ధాంతరంగా యింకో స్కూల్లో యెలా చేర్చుకుంటార్రా"

"నువ్వు చెబితే చేర్చుకుంటారు"

"ఏడాది మధ్యలో నేచెప్పినా చేర్చుకోరురా"







"అయితే ఈ యేడు చదువుమానేస్తాను. అప్పడాల పిండిగాడు కొట్టిచంపుతున్నాడు. వాడిదగ్గర నే చదువుకోను."

"కొట్టొద్దని నే చెబుతానులే"

"వాడూరికే వుడుక్కుంటాడు. అనవసరంగా దంచుతాడు. చెప్పే పాఠాలుతక్కువ. కొట్టే దెబ్బలెక్కువ."

"పీజోలికి రావొద్దని నే చెబుతాగా"

"మెల్లిగా చెబితే లాభంలేదు."

"గట్టిగానే చెబుతాలే. వెళ్ళు"

"నువ్వొచ్చి దిగబెడితేనేగాని వెళ్ళను"

పదినిమిషాలు బేరమాడిన తరవాత. మళ్ళీ కసింత పటికబెల్లంపెట్టి నాయనమ్మ కర్ర పొడుచుకుంటూ నాతో స్కూలు కొచ్చింది. నాయనమ్మ యింట్లో నడవడానికి కర్రసాయం అక్కర్లేదుగాని. రోడ్డుమీద నడవాలంటే కర్ర చేతులోవుండాలి కుక్కల్నీ పందుల్నీ యుడిపించడానికి. తిన్నగా క్లాసులోకే వెళ్లిపోయాం. "నాలుగు మూళ్ళ పన్నెండు. నాలుగునాళ్ళ పదహారు" అని క్లాసంతా అరుస్తున్నారు. అప్పడాల పిండి వెంకన్న బుగ్గలు నులుముతున్నాడు. నన్నూ. మా నాయనమ్మనీ చూ డ గా నే క్లాసంతా నిశ్శబ్దమయిపోయింది. అప్పడాల పిండి నాకేసి గుడ్లురిమి చూశాడు. నాయనమ్మ వెనకాలుంటే నాకేం లెక్క. పోపో. చూచుకో అనుకున్నా.

"ఏమయ్యా. ఎందుకయ్యా పి ల్ల ల్ని అలాకొట్టి చంపుతావు" అంది నాయనమ్మ. "రూళ్ళకర్రతో వే ళ్ళ మీ ద కొట్టావట. మా వెర్రినాగమ్మని"!

"అల్లరి చె చే స్తే ప ని ష్మెం టు ఇఇవ్వొద్దా".

"పిర్రమీదకొక్క దెబ్బకి ఫిర్యాదులేదుగాని, వేళ్ళమీదకొడితే పూరుకుంటారుటయ్యా. అయినా మావాడిప్పుడు ఏం అల్లరిచేశాడని కొట్టినట్టు" దానికి జవాబు చెప్పగలిగితేనా. గుడ్లు మిటకరించి చూశాడు మాష్టరు.

"నాయనమ్మా, నువ్వు అప్పడాలెండబెట్టి నన్ను కాకుల్ని కాయమన్నావా. ఎందుకాలక్షేపంగా వొచ్చావని అడిగితే మాస్టారూ, మా నాయనమ్మ అప్పడాలు యెండబెట్టి కాకులెత్తుకుపోకుండా కాయమంది అన్నాను. అంతే. అప్పడాలు అవగానే ఆయనకి కోపమొచ్చింది. నువ్వే చెప్పు అప్పడాలు అన్నాను గాని అప్పడాలపిండి అన్లేదుగా. ఇందులో తప్పేమన్నా వుందా?"

"అయ్యో, అప్పడాలపిండీ. ఇన్నేళ్ళొచ్చినా ఇంకా పుడుక్కుంటూనే వున్నావుటయ్యా"

"ఏమండోయ్ దామ్మగారూ, పెద్దవారని మర్యాదగా పూరుకుంటే" అప్పడాలపిండి గుడ్లెర్రజేశాడు. నాయనమ్మ ఝుడుస్తుందా!

"ఉడుకుడుకు బోలె" అంది. క్లాసంతా గొల్లుమన్నారు. ఏం జేస్తాడు ఆయన, చేతులో రూళ్ళకర్రయితే, మా నాయనమ్మ చేతులో పెద్దకర్ర. మా నాయనమ్మతో చాల్లేడుగా.

"మావాడిజోలికి ఇంకెప్పుడూ రాకు. వాడివల్లేమన్నా తప్పువుంటే నాతో చెప్పు. నే కూకలేస్తాను! అని కట్టడిచేసి వెళ్ళిపోయింది. ఆ తరవాత వయా నాయనమ్మ, మనమంటే హడల్. ఇప్పుడు వయా మా ఆవిడ మన అథారిటీ మళ్ళీ లేచిపోయింది. మొదటి విజయం నిత్యానందం గారు యిష్టమొచ్చినంతసేపూ, విశ్రాంతి తీసుకోవొచ్చును. వారిని లెమ్మని వొత్తిడి చెయ్యడానికి ఎవరికీ అధికారం లేదు. ఎవరైనా ఆ విషయం గుర్తించక ఒత్తిడి చేసినా, నిత్యానందంగారు, ఖాతరుచెయ్యరు. హాయిగా నిద్రపోతారు, నిద్రపట్టకపోతే, కళ్ళుతెరిచే నడుం వాలుస్తారు. లేదా, పక్కమీద పడుకుని, అటూ యిటూ దొర్లుతారు. కాని, లేవరు. ఆదేవిధంగా నక్షత్రకుడి బాధా వదిలిపోయింది. మా పెళ్లయింతరవాత వాడిపోరు భరించడం మరీదుర్భరమయింది. నాకేకాదు, మా ఆవిడకి కూడా సలహాలివ్వడం ప్రారంభించాడు....బోడిసలహాలు. మా పెళ్ళి తనవల్లే జరిగిందిట. వెయ్యి అబద్ధాలాడి యిల్లు నిలబెట్టాలన్న సామెత పట్టుకుని ఎంతో కష్టపడి, ఈ సంబంధం కుదిర్చాడుట. అంచేత మా సంసారం దిద్దడానికి తనేదో బోలెడు హక్కులు దాచి పెట్టుకున్నట్టు అన్ని విషయాల్లోనూ, బుడుంగున దూరబడి, చెప్పొచ్చేవాడు.

"ఏమిటోయ్ నిత్యానందం, మీ అమ్మగారు గోలెట్టిపోతున్నారు. అవిడొచ్చిందగ్గిర్నుంచీ అమ్మగారిమాట అసలే వినడం లేదుట. మీ అమ్మ నీమీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఎప్పుడు కోడలొస్తుందా, ఎప్పుడు సుఖపెడుతుందా అని ఎదురు చూసింది. కాని చిన్న మెత్తు సాయం చెయ్యదుట నీపెళ్లాం. ఎక్కడ కందిపోతుందో అని అన్నిటికి వెనకేసుకొస్తావుట. మా అందరికీ పెళ్ళిళ్లవలేదా? పెళ్లాలు కాపరానికి రాలేదా? తప్పుసుమా. పెళ్లాన్ని అదుపులోవుంచుకోవాలి. అతి చనువిచ్చి ముద్దుచేస్తే ముక్కెట్టు కుంటారు. 'తల్లివిషమాయె, పెళ్లాము బెల్లమాయె' అవకూడదు"







మనవాడి ఉపన్యాసాలు వినే రోజులు పోయాయి. 'ఈ గోడలకీ ఆ స్తంభాలకీ చెప్పుకో' అని వాడు ప్రారంభించగానే చల్లగాజారి పోయేవాడిని.

"చూడు సుబ్బమ్మా" అని మా ఆవిడ దగ్గిర ప్రవేశించేవాడు. "నీపెళ్ళి చేయించిన వాడిని కనక, నీ మంచి కోరిన వాడిని కనక, చెబుతున్నాను" అని ప్రతిమాటూ ఉపోద్ఘాతం. "మా పెళ్ళిచేయించింది పురోహితుడయ్యా, నువ్వుకాదు" అందామనుకునే వాడిని "అత్తగారికి అణకువగావుండాలి. గుట్టుగాసంసారం దిద్దుకోవాలి."

"అవునండీ అబద్దాలాడ కూడదు. దైవభక్తి కలిగివుండాలి. పెద్దలమాట ధిక్కరించరాదు. ఇంకా చాలానీతులు స్కూల్లోనే నేర్పుకున్నానండి." అని మాఆవిడజవాబు. ఏ;మాత్రం బుద్ధున్నవాడయినా;•దాంతో వెనక్కి తగ్గవలసిందేనా....కాని వాడికి సున్నితంగా చెబితే అర్థం కాదుగా. అలా నీతులు చెబుతూనే వున్నాడు. సలహాలు యిస్తూనే వున్నాడు.

"నీకే ఓకొడుకున్నాడనుకో. వాడు పెద్దవాడయినాక పెళ్ళి చేశావనుకో. కోడలు యింటికి కాపరానికొచ్చి నువ్వు చెప్పిన మాట సుతరామూ వినలేదనుకో. అప్పుడు నీకెలా వుంటుంది. ఆలోచించుకో". మా ఆవిడకింకా నెలలన్నా తప్పలేదు. వాడు అనుకోమన్నవన్నీ ఆలోచించుకుంటే బుర్ర గిరగిర తిరిగిపోదూ. మా ఆవిడ విసిగిపోయిందంటే తప్పా. విని విని చివరికి ఓనాడు మా ఆవిడంది.

"నక్షత్రకుడుగారూ, నాదోచిన్నకోరిక" ఆ పేరు వినగానే వాడు బిక్కచచ్చిపోయా

దనుకో. ఇన్ని రోజుల్నించీ వాడికిపేరంటే పెట్టాముగాని. ఎదటబడి ఆపేరెట్టి ఎప్పుడూ వాణ్ణి పిలవలేదు.

"నక్షత్రకుడుగారూ, మాయింటినించి వీశెడు జీడిపప్పుపాకం తెప్పించిపెడతాను గాని. మాకు సలహా లివ్వడం మానుకుంటారూ?" దాంతో వాడి ప్రైప్రాణంపైన పోయింది. మొహంపాలిపోయింది. నిజమే. నలుపుమనిషి కనక ఎంత పాలిపోయినా, మొహంలో కనిపించదనుకో. కాని వాడి వాలకం చూస్తే పాలిపోయినట్టు తెలిసిపోయింది. వుండరా చొప్పదంటు ప్రశ్నవేసి చంపొద్దని చెబితే వినిపించుకోవేమిట్రా? మా ఆవిద యింతగట్టిదని తెలిసుంటే, ఈపెళ్ళి.రికమెండు చేసేవుండనని, అమ్మతోటో, ఇంకా యెవరెవరితోటో చెప్పుకు యేడ్చాడుట.

"ఏడవకు ఏడవకు వెర్రినాగమ్మ. ఏడిస్తే నీ కళ్ళు నీలాలుగారు" అని ఓదారుద్దామనుకున్నాగాని. మన వేళాకోళం అర్థంగాక, తిరిగి తగులుకుంటాడేమోనని కిక్కురుమనకుండా వూరుకున్నా. పర్యవసానం, మా జోలికి రావడం మానుకున్నాడు.

నక్షత్రకుడి నోరు మూయిస్తే బాగానే వుందిగాని, నా స్నేహితుల్ని కూడా యిడిపించి నే వాళ్ళని కలుసుకోనివ్వకుండా చేస్తోందిరా! ముఖ్యంగా బండరాముణ్ణి. బండరాముడు నీకు తెలుసుగా. ఒకటో క్లాసునించి నేనూ వాడూ స్నేహితులం. నేను స్కూలుకెళ్ళనని మారాము పెడుతూ వుంటే వాణ్ణి మచ్చిక చేసి, సాయమిచ్చి స్కూలుకి పంపించింది నాయనమ్మ. నేనంటే వాడికి తగని ఇష్టం. నామీద ఈగవాలనిచ్చేవాడుకాదు. అప్పుడప్పుడు నే చేసిన అల్లరికి, వాడు కిక్కురుమనకుండా దెబ్బలుతిన్నాడుకూడాను. బండవెధవైనా, బుద్ధిమంతుడని నాయనమ్మే సర్టిఫికెట్ యిచ్చింది. మాట మోట అనుకో. మా ఆవిడదగ్గర జాగ్రత్తగా వుండాలని వాడికి తెలియొద్దూ. ఓనాడేం చేశాడంటే, రోడ్డుమీద నించుని. "ఒరే నిత్యానందం పెళ్ళయిందగ్గిర్నించీ నీ దర్శనమే మాకు కరువయిపోయింది. పడకగది వొదలడమే లేదు. ఈపద్ధతిని పీనుగయిపోతావు జాగ్రత్త. సరసాలు చాలించి. బయటకిరా" అని యింటికప్పెగిరి పోయేలా అరిచాడు.

"ఎవరండోయ్ ఈ స్నేహితుడు"

"వాడా బండరాముడు"

"పోకిరీరాముడులా వున్నాడు"

"శబాష్. ఆ టైటిల్‌తో మరో సినిమా తీసి పారెయ్యొచ్చు. మాటలు నువ్వు. పాటలు నేనూ రాసేద్దాం" అన్నాను. మా ఆవిడ మెత్తబడబోయింది కాని యింతలోనే "ఒరేయ్ బయటికొస్తావా. ఇంట్లో చొరబడి యీడ్చుకు రమ్మంటావా" అని వాడు మళ్ళీ అరిచాడు. వాడికి ఆవేశమొస్తే వొళ్ళు పైతెలీదు. అన్నంతపనీ చేసేస్తాడు. ఎవడో సవాలుచేశాడని యీత రాకుండానే కాలవలో వురికాడు. వుషారిస్తే, తాటిచెట్టు మీదకి పాకిపోయాడు. చచ్చినంతపని అయ్యేదనుకో! అందుకే బండరాముడని బిరుదొచ్చింది. వాణ్ణికవ్వించడం కొరివితో తలగోక్కోడం.

"క్యా బాత్ హై. ఆడంగులంటే మనకేం భయంలేదురోయ్. రమ్మంటావా లోపలికి".

"వొద్దు నేనే వొస్తున్నారా. నువ్వులోపలికి జొరబడకు" అని ఆపేశాను. "ఇలాటి వెధవల్తో మీకు స్నేహమేమిటండీ" అంది మా ఆవిడ. మా స్నేహంయొక్క హిస్టరీ. జాగ్రఫీలుచెప్పాను. చివరికి ఈ మాటుకి మాత్రం వెళ్ళనిస్తున్నాని వొదిలిపెట్టింది.





"పోకిరీ వెధవల్తో స్నేహం కూడదు చెడిపోతారంటుంది. ఇదివరకు రోజూ కలుసుకునే వాళ్ళం. ఇన్నాళ్లూ చెడిపోనిది, ఇహముందు మాత్రం ఎందుకు చెడిపోతాను అంటే వినదు. ఇప్పటికే చెడిపోలేదని గ్యారంటీ యేమి టంటుంది! ఒక్కొక్కప్పుడు మహ మూర్ఖపు పట్టుబడుతుంది. ఆడవాళ్లంతా. ముఖ్యంగా పెళ్లాలంతా అంతేనా. అలాటప్పుడేం చెయ్యాలిరా. దంచాలా: ఏడిశావులే. పిచ్చి సలహాలు చెప్పకు. నా ఆవిడంటే ఇప్పుడు నాకు చాలాయిష్టంరా! ఆవిడొచ్చిన తరవాత మనకింట్లో చాలా సౌకర్యాలు ఏర్పడ్డాయి. అంచేత అప్పుడప్పుడు నాకు వొళ్లు రవరవమండిపోయి. డొక్క వాలికలు చేద్దామన్నంత కోపమొచ్చినా కొట్టడానికి చేతులు లేవవు. మనకే యెదురు తగులుతాయేమోనన్న భయమేమోనంటావా. పోరా. అలాటప్పుడు ఏం చెయ్యమంటావురా....అయితే బతిమాలుకోమంటావా! వారేయ్ నే అదే చేస్తున్నారా! ఎలాగో అలాగ నామాట నెగ్గుకొస్తూనేవుంది. భయాన సాధించినా, నయాన సాధించినా విజయం విజయమే కదురా! ఎందుకురా ఆ నవ్వు. పో నీ పొరపళ్లే బయట పడతాయి. నాకేం!

□□□

సోమంచి యజ్ఞన్న శాస్త్రి